

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పెద్దకొత్తపల్లి, జనవరి 29: మండలంలోని ముష్టిపల్లి గ్రామానికి చెందిన గాదిమల్ల కృష్ణయ్య(35) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కృష్ణయ్యకు 11 ఏళ్ల క్రితం గంట్రావుపల్లి గ్రామానికి చెందిన రాధికతో వివాహమైంది. బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఇటీవల ముష్టిపల్లికి వచ్చారు. ఆదివారం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన కృష్ణయ్య ఇంటి నుంచి వెళ్లి తన పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు గుర్తించారు. తండ్రి చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది. కృష్ణయ్యకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

రేసు గుర్రాలు

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం బరిలో నిలిచేందుకు నాయకుల సన్నాహాలు
- కాంగ్రెస్ నుంచి డాక్టర్ మల్లు రవి, మందా జగన్నాథ్, సంపత్ కుమార్ పేర్లు తెరమీదకి
- బీజేపీ అభ్యర్థిగా బంగారు శ్రుతి పేరు ఖరారయ్యే అవకాశం
- ఎంపీ పోతుగంటి రాములు తనయుడు భరత్ కూడా ఆ పార్టీ నుంచి పోటీలో ఉన్నట్లు ప్రచారం
- బీఆర్ఎస్ నుంచి రాములుకు టికెట్‌పై సందిగ్ధం
- గోరటి వెంకన్నకు అవకాశం?
- బీఎస్పీ నుంచి బరిలో ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్?



మల్లు రవి
మందా జగన్నాథ్
సంపత్ కుమార్
పి.రాములు
గోరటి వెంకన్న
ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
బంగారు శ్రుతి

నాగర్‌కర్నూల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలు రేసు గుర్రాలను రెడీ చేస్తున్నాయి. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో గద్వాల, అలంపూర్, వనపర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ సారి జరిగే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్యనే ప్రధానమైన పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే.. బీఎస్పీ తెలంగాణ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కూడా నాగర్‌కర్నూల్ నుంచి పోటీ చేసే యోచనలో ఉన్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో అందరి దృష్టి నాగర్‌కర్నూల్ నియోజకవర్గంపై పడింది. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రంగంలోకి దిగితే పోటీ ఆసక్తికరంగా మారే అవకాశాలు ఉన్నాయి.

కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలనలో ముగ్గురి పేర్లు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా అయిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు సంబంధించి అధిష్ఠానం పరిశీలనలో ముగ్గురి పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ అధికార ప్రతినిధి డాక్టర్ మల్లు రవి, మాజీ ఎంపీ మందా జగన్నాథ్, ఏఐసీసీ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్‌ల గెలుపు అవకాశాలపై సర్వే చేయిస్తున్నారని సమాచారం. ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో సామాజిక సమీకరణాల్లో మాల మాదిగ ఓట్లను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. సోదరుడు భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రిగా ఉండటం, సుదీర్ఘకాలం నుంచి పార్టీని వీడకుండా ఉండడం మల్లురవికి ప్లస్‌పాయింట్‌గా ఉంది. ఒకవేళ మాదిగ సామాజిక వర్గానికి టికెట్ కేటాయించాలనుకుంటే అవకాశం తనకు ఇవ్వాలని మందా జగన్నాథ్ కాంగ్రెస్ అధిష్ఠానానికి అప్పీలు చేశారు. ఏఐసీసీ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్ కూడా టికెట్ ఆశిస్తున్నారు. సొంత పార్టీలోనే తనను పనిగట్టుకుని అలంపూర్‌లో ఎమ్మెల్యేగా ఓడించారని, పార్లమెంట్ టికెట్ ఇచ్చి తనకు జరిగిన రాజకీయ నష్టాన్ని పూడ్చాలని ఆయన అధిష్ఠానానికి విన్నవించినట్లు సమాచారం. ఇదిలా ఉంటే రెండు రోజుల నుంచి నియోజకవర్గంలో కొత్త డిమాండ్ కూడా తెరమీదకొచ్చింది. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొణిదెల రాముకు కాంగ్రెస్ నుంచి టికెట్ ఇవ్వాలని మండలాల్లో మీడియా సమావేశాలు నిర్వహించి అధిష్ఠానానికి విజ్ఞప్తులు పంపిస్తున్నారు.

రాములుకు టికెట్ వద్దంటున్న ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు

బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ పోతుగంటి రాములుకు ఆ పార్టీ నుంచి టికెట్ దక్కుతుందా? లేదా? అనే అంశంలో సందిగ్ధం నెలకొంది. బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు రాములుకు తిరిగి బీఫామ్ ఇవ్వొద్దని అధిష్ఠానానికి చెప్పడంతో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పేరు తెరమీదకు వచ్చింది. గోరటి వెంకన్న పోటీ చేస్తారా? లేదా? అనే విషయంలో ఇంకా స్పష్టత రాలేదు.

బీజేపీ నుంచి మళ్లీ ఆమెకే టికెట్?

బీజేపీ నుంచి బంగారు లక్ష్మణ్ తనయురాలు బంగారు శ్రుతికి టికెట్ దాదాపు ఖరారైనట్లు తెలిసింది. పార్టీకి అంకిత భావంతో సుదీర్ఘకాలంగా బంగారుశ్రుతి చేస్తున్న కృషి కారణంగా ఆమెకు మరోసారి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి టికెట్ ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఎంపీ పోతుగంటి రాములు తనయుడు భరత్‌ప్రసాద్ కూడా టికెట్ ఇస్తే బీజేపీలో చేరేందుకు సిద్ధమని సంకేతాలు పంపినట్లు వార్తలొస్తున్నాయి. దీనిని భరత్ ప్రసాద్ నిక్కచ్చిగా చెప్పకపోయిన ప్పటికీ.. ఖండించకపోవడం గమనార్హం.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బరిలో ఉంటే అనూహ్య ఫలితం

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి బీఎస్పీ అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోటీ చేయబోతున్నారనే వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ పార్లమెంట్ నియోజకవర్గంతో ప్రత్యేక అనుబంధం ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇక్కడి నుంచి పోటీ చేస్తే ఫలితం ఆసక్తికరంగా మారే అవకాశాలున్నాయి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, బీఎస్పీల మధ్య చతుర్ముఖ పోటీ ఉంటే ఎన్నికల ఫలితం అనూహ్యంగా మారే సూచనలు మెండుగా ఉన్నాయి.



పోతులమడుగు తండా దగ్గర సాగు చేసిన జొన్న పంట

ఆరుతడితో.. లాభాల సిరులు



అమిస్తాపూర్ శివారులో ఆముద పంటను కోస్తున్న రైతులు

- యాసంగిలో జొన్న, మొక్కజొన్న, ఆముదం సాగు
- తగ్గిన వరి, వేరుశనగ సాగు
- తక్కువ నీటితో.. అధిక దిగుబడులు
- చీడపీడలూ తక్కువేనంటున్న రైతులు

భూత్పూర్, జనవరి 29: యాసంగిలో ఆరుతడి పంటలు సాగు చేస్తున్న మండలంలోని రైతులు సిరులు కురిపిస్తున్నారు. వానాకాలం కంటే యాసంగిలో ఈ పంటలు వేయడం వల్ల అధిక దిగుబడులు వస్తున్నాయని, చీడపీడల బెడద తక్కువగా ఉందని అంటున్నారు. రెండు మూడేళ్లుగా జొన్న, మొక్క జొన్న, ఆముదం పంటలు వేసి, లాభాలు గడిస్తున్నారు. ప్రస్తుతం జొన్నలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దాంతో వానాకాలం కంటే రబీలోనే ఎక్కువ మంది రైతులు జొన్నలు వేసి, లాభాలు పొందుతున్నారు. గతంలో ఈ తరహా ఆరుతడి పంటలను రంగారెడ్డి, నల్లగొండ, రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాల్లో ఎక్కువగా పండించేవారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లాలోని చాలా మండలాల్లో యాసంగిలో ఆరుతడి పంటలు జొన్న, మొక్క జొన్న, ఆముదాలు, సజ్జలు, రాగులు, కొర్రలు, ఊదలు, సన్ ఫ్లవర్ సాగు చేస్తున్నారు.

200 ఎకరాల్లో సాగు

ఒక్క భూత్పూర్ మండలంలోనే జొన్నలు, మొక్కజొన్నలు, ఆముదాలను సుమారు 200 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం జొన్నలకు మార్కెట్‌లో క్వింటాలుకు రూ.10 వేల నుంచి రూ.14 వేల వరకు ధర ఉండటంతో వరి సాగును తగ్గిస్తున్నారు. రాగులకు కూడా మార్కెట్‌లో చాలా డిమాండ్ ఉంది. ప్రజలు షుగర్ వ్యాధి నుంచి బయటపడేందుకు జొన్నరొట్టె, రాగి ముద్ద, రాగి అంబలి ఆహారంగా తీసుకుంటున్నారు. దీంతో పట్టణాల్లో, పల్లెల్లో వీటికి డిమాండ్ పెరిగింది. వానాకాలంతో పోలిస్తే చీడపీడల బెడద తక్కువగా ఉండటంతో ఆరుతడి పంటలు, కూరగాయల తోటలు సాగు చేస్తున్నారు. ఈ పంటలను చాలా మంది కోతకు రాక ముందే రైతుల వద్దకు వెళ్లి కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

చీడపీడలు తక్కువ



నేను చాలా రోజులుగా వరితో పాటు ఆరుతడి పంటలు సాగు చేస్తున్నా. వానాకాలంలో సాగు చేసే పంటల కంటే యాసంగిలో పండించే జొన్న, మొక్కజొన్న, ఆముదాలు, సన్ ఫ్లవర్, కూరగాయల తోటలకు చీడపీడల బెడద చాలా తక్కువగా ఉంటుంది. దిగుబడి కూడా బాగుంటుంది. వానాకాలం కంటే యాసంగిలోనే మంచి దిగుబడులు వస్తుండటంతో రైతులు ఆగస్టు నుంచి మార్చి వరకు ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు.

- సదానందగౌడ్, రైతు, భూత్పూర్

మంచి దిగుబడి వస్తుంది



నేను రెండేళ్లుగా యాసంగిలో ఆముదం సాగు చేస్తున్నా. వేరుశనగ కంటే మంచి దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో ఆముదాలకు డిమాండ్ కూడా బాగానే ఉంది. ఎకరంలో 10 నుంచి 25 క్వింటాళ్ల ఆముదాలు పండుతాయి. యాసంగిలో వాతావరణం పొడిగా ఉంటుంది కాబట్టి చీడపీడల బాధ తక్కువగా ఉంటుంది. పంట దిగుబడితో పాటుగా మార్కెట్‌లో ధర బాగుంటుంది.

- కోట్ల మధు, రైతు, అమిస్తాపూర్

కూలీల కొరత ఉండదు



యాసంగిలో ఆముదాలు, జొన్నలు, మొక్క జొన్నలు సాగు చేస్తే కూలీల కొరత ఉండదు. వర్షాలు వచ్చి పంటలు పాడవుతాయన్న భయం ఉండదు. ఇంట్లో ఉన్నవాళ్లు పనులు చేసుకోవచ్చు. శేన్లకు మందు కొట్టే బాధ ఉండదు. పందుల నుంచి పంటను కాపాడు కుంటే మంచి దిగుబడి వస్తుంది.

- కోట్ల మనెమ్మ, రైతు, అమిస్తాపూర్

జిల్లా ప్రాజెక్టులకు నిధులు కేటాయించండి

- కేసీఆర్‌ను పాలమూరు ఎంపీగా గెలిపిస్తే తీరని అన్యాయం చేశారు
- ప్రాజెక్టుల పనులు కాంగ్రెస్ హయాంలోనే 90 శాతం పూర్తి
- మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మెల్యేల వినతి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యేలు, వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జనవరి 29: వచ్చే బడ్జెట్‌లో పాలమూరు ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని జిల్లా ఎమ్మెల్యేలు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, మహబూబ్‌నగర్, దేవరకద్ర, మక్తల్, నారాయణపేట ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డి మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ నేతగా వచ్చిన కేసీఆర్‌ను పాలమూరు ఎంపీగా గెలిపిస్తే జిల్లాకు తీరని అన్యాయం చేశారని అన్నారు. కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల ప్రాజెక్టును విస్మరించారని చెప్పారు. కాంగ్రెస్ గతంలో అధికారంలో ఉన్నప్పుడే భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు ప్రాజెక్టులను చేపట్టి, దాదాపు 70 నుంచి 90 శాతం పనులు పూర్తి చేసిందన్నారు. రూ.12 వేల కోట్లతో పూర్తయ్యే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఆంధ్ర కాంట్రాక్టర్లతో లాలూచి పడి డిజైన్ మార్చి, శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను తెచ్చేలా డిజైన్ మార్చారన్నారు. రూ.35 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్లు వెచ్చించినా ఇప్పటివరకు ఒక్క ఎకరాకు కూడా నీరివ్వలేదన్నారు. పాలమూరు రైతులను నిలువునా ముంచారని అన్నారు. అదే జూరాల నుంచి ప్రాజెక్టును చేపట్టి ఉంటే ఏడు లక్షల ఎకరాలకు నీరందేదని పేర్కొన్నారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు స్థాయిని పెంచి, ఆయకట్టుకు నీరివ్వడంతోపాటు పాలమూరుకు తాగునీరు ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. అందుకోసం వచ్చే బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే యెన్నం కోరారు.

వంశీచంద్ పాదయాత్ర



వంశీచంద్‌రెడ్డి

- రేపు మక్తల్ క్షీరలింగేశ్వరస్వామి మఠం నుంచి ప్రారంభం
- ముగింపు సభకు సీఎం రేవంత్‌రెడ్డి రాక

మహబూబ్‌నగర్, జనవరి 29: పాలమూరు పునరుజ్జీవం పేరుతో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లావంశీచంద్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో పాలమూరు న్యాయ యాత్రకు శ్రీకారం చుడుతున్నారు. ఈ నెల 31లో నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం కృష్ణా గ్రామంలోని క్షీరలింగేశ్వరస్వామి మఠం నుంచి యాత్ర ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో కలిసి వంశీచంద్ పాదయాత్రపై చర్చించి, నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చినందున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు నడిపించాలనే ఉద్దేశంతో రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో ఈ యాత్ర చేపడుతున్నానని ఆయన ప్రకటించారు. 31న జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహ సమక్షంలో పాదయాత్రను ప్రారంభించనున్నారు. ప్రతీ నియోజకవర్గంలో మూడు రోజుల చొప్పున 25 రోజుల పాటు యాత్ర సాగనుంది. ఫిబ్రవరి నాలుగు నుంచి ఆరు వరకు నారాయణపేట జిల్లాలో, ఎనిమిది నుంచి పదో తేదీ వరకు దేవరకద్ర నియోజకవర్గంలో పాదయాత్ర కొనసాగుతుంది. 11 నుంచి 13 వరకు షాద్‌నగర్‌లో, 15 నుంచి 17 వరకు జడ్చర్ల నియోజకవర్గంలో, 19 నుంచి 21 వరకు మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో యాత్ర సాగనుంది. చివరగా కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌తో చర్చించి పాదయాత్ర తేదీలను నిర్ణయించనున్నారు. ముగింపు సభకు ముఖ్యమంత్రి హాజరు కానున్నారని పార్టీ శ్రేణులు తెలిపారు. ఏడు నియోజకవర్గాల్లో సాగే పాదయాత్రలో ప్రతీ రోజు ఉదయం 10 కిలో మీటర్లు, సాయంత్రం 10 కిలో మీటర్లు యాత్ర సాగనుంది. రోజూ యాత్ర ముగిసే గ్రామంలో ఆ గ్రామంలోని సామాన్య కార్యకర్త ఇంట్లోనే ఆయన బస చేయనున్నారు.

నెరవేరిన ఉద్యోగుల కల

- జోగులాంబ గద్వాల జిల్లాకు భవిష్య నిధి బదిలీతో ఊరట
- ఏళ్ల తరబడి ఎదురు చూపులకు తెర
- ఇంకా జమ కాని వడ్డీ



జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయం

అయిజ, జనవరి 29: భవిష్య నిధి బదిలీతో ఉద్యోగులకు ఊరట లభించింది. పంచాయితీరాజ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సాధారణ భవిష్య నిధులను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి విభజించి, జోగులాంబ గద్వాల జిల్లాకు జీపీఎఫ్ ఖాతాలు పంపించారు. దాంతో జిల్లా నుంచే ఉద్యోగ, ఉపాధ్యాయులు జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి జీపీఎఫ్ రుణాలు తీసుకునే అవకాశం దక్కింది. భవిష్య నిధి ఖాతాలో జమ చేసిన మొత్తం ఎంత ఉంది? తదితర వివరాలు తెలుసుకునే వీలు ఏర్పడింది. గత టీఆర్ఎస్ ప్రభుత్వం నూతన జిల్లాలు ఏర్పాటు చేసింది మొదలుకుని ఉమ్మడి జిల్లా పరిధిలోనే గద్వాల జిల్లా ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాలు కొనసాగుతూ వచ్చాయి. భవిష్య నిధుల ఖాతాల బదిలీ కోసం ఏళ్ల తరబడి ఎదురు చూశారు. ఖాతాలు బదిలీ కావటంతో గత సోమవారం 22వ తేదీన జీపీఎఫ్ ఖాతాలకు సంబంధించి ప్రత్యేక కౌంటర్‌ను గద్వాల జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రారంభించారు.

సుదీర్ఘ తర్జన భర్జన అనంతరం

గత రాష్ట్ర ప్రభుత్వం 2016 సంవత్సరంలో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లా నుంచి గద్వాల, అలంపూర్‌ను విడదీసి, జోగులాంబ గద్వాల జిల్లాగా ఏర్పాటు చేసింది. దీంతో నూతనంగా జిల్లా పరిషత్ ఏర్పాటయ్యింది. 2019 నుంచి ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాలను జిల్లాల వారీగా విభజించే విషయంలో అధికారులు ఆలోచనలో పడ్డారు. జిల్లాలు విభజించినా.. ఉద్యోగులను విభజించకపోవడంతో జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులు ఇతర జిల్లాలకు చెందిన వారు ఉండటం, స్థానికులు ఇతర జిల్లాల పరిధిలోకి వస్తుండటంతో వారి ఖాతాలను జిల్లాల వారీగా విభజించే విషయంలో కసరత్తు చేశారు. ఉద్యోగుల విభజన పూర్తి స్థాయిలో జరిగాక.. వారు పని చేస్తున్న జిల్లాను పరిగణలోకి తీసుకుని, జీపీఎఫ్ ఖాతాలను బదిలీ చేశారు. దీంతో గద్వాల జిల్లా పరిషత్‌కు పాత జిల్లా అయిన మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ నుంచి ఖాతాలు బదిలీ అయ్యాయి.

ఉద్యోగుల ఖాతాల బదిలీ..

మండల, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో పని చేస్తున్న బోధనేతర సిబ్బందిని పంచాయితీరాజ్ ఉద్యోగులుగా పరిగణిస్తారు. మిషన్ భగీరథ, పంచాయితీరాజ్ శాఖ, ఇంజనీరింగ్ విభాగాల్లో పని చేస్తున్న వారు, గ్రామీణ, మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు జిల్లా పరిషత్ పరిధిలోకి వస్తారు. ఈ ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం ప్రభుత్వం భవిష్య నిధిని ఏర్పాటు చేసింది. ఇందులో ఉద్యోగి తన ఖాతాలో జమ చేసుకున్న దాంట్లోంచి తిరిగి 50 శాతం రుణంగా ఇచ్చేందుకు అవకాశం కల్పించింది. వారు జమ చేసుకున్న నగదుకు 2009 నుంచి ఖాతాదారులకు వడ్డీ చెల్లించాల్సి ఉంది. ఈ వడ్డీ అంశం సమస్యగా ఉండటంతో చెల్లించాల్సిన వడ్డీని పక్కకు పెట్టి, ఉద్యోగులు జమ చేసుకున్న మొత్తాన్ని లెక్కించి ఖాతాల వారీగా వివరాలను గద్వాలకు బదిలీ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 927 ఖాతాలు బదిలీ చేయగా, వాటికి సంబంధించిన రూ.28 కోట్లను జిల్లా కోశాధికారి ఖాతాలో జమచేశారు. కౌంటర్‌ను ప్రారంభించిన మొదటి విడతలో తొమ్మిది మంది ఉద్యోగులకు జీపీఎఫ్ ఖాతాల్లోంచి రూ.25 లక్షలు మంజూరు చేశారు. రుణాలకు సంబంధించిన చెక్కులను సైతం అందించారు.

ఊపిరి పీల్చుకున్న ఉద్యోగులు

జీపీఎఫ్ ఖాతాలు బదిలీ చేయడంతో గద్వాల, అలంపూర్ ప్రాంతాలలో పని చేస్తున్న ఉద్యోగులు ఎన్నో సమస్యల నుంచి బయట పడినట్లు అయ్యింది. గతంలో ఉద్యోగి తాను పని చేస్తున్న ప్రాంతం నుంచే జీపీఎఫ్ ఖాతా రుణం కోసం వేతనాలు చెల్లించే అధికారం ఉన్న డ్రాయింగ్ అధికారి నుంచి ఉమ్మడి జిల్లా సీఈఓకు దరఖాస్తు పంపించేవారు. తర్వాత వివరాలు పరిశీలించి, ఉద్యోగి ఖాతాలో రుణం జమచేసేవారు. ఇందుకు నెలల తరబడి ఆలస్యం జరిగేది. సమస్య ఎదురైతే ఉద్యోగి మహబూబ్‌నగర్ వెళ్లి పరిష్కరించుకునేవారు. ప్రస్తుతం ఖాతాలు గద్వాలకు బదిలీ కావటంతో రుణాల మంజూరు అధికారి జిల్లా పరిపాలన ఉప అధికారికి అప్పగించారు. దాంతో ఖాతాకు సంబంధించిన సమస్యలు, రుణాల విషయంలో స్థానికంగానే పరిష్కరించుకునే వీలు ఏర్పడింది.

ఇబ్బందులు తొలగిపోయాయి



జీపీఎఫ్ ఖాతాలు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి గద్వాలకు బదిలీ కావటంతో ఇబ్బందులు తొలగిపోయాయి. దీర్ఘకాలంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్య పరిష్కారం కావటంతో ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. జీపీఎఫ్ ఖాతాలు, రుణాల విషయంలో సమస్యలుంటే స్థానికంగానే పరిష్కరించుకోవచ్చు. ఈ కారణంగా సమయం వృథా కాదు. వడ్డీ సమస్య అలాగే ఉంది. ఆ సమస్య త్వరలో పరిష్కారం కావాల్సి ఉంది. అధికార, ప్రజా ప్రతినిధులు ఆ దిశగా ఆలోచించాలి.

- పి.తిమ్మారెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

సమస్యలు పరిష్కరించుకోవచ్చు



జీపీఎఫ్ విషయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాము. ఏ సమస్య ఉన్నా మా కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవచ్చు. అందుకు మా సహకారం పూర్తి స్థాయిలో ఉంటుంది. ఖాతా, అందులోని జమ మాత్రమే బదిలీ అయ్యింది. ఉద్యోగుల వడ్డీ జమకాలేదు. అది జమ అయితే పూర్తి స్థాయిలో పని జరిగినట్లు అవుతుంది.

- కాంతమ్మ, జడ్పీ సీఈవో, జోగులాంబ గద్వాల

ఆరు గ్యారెంటీలను అమలు చేయడమే లక్ష్యం



దేవునితిర్మలాపూర్‌లో బస్సుషెల్టర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి, జనవరి 29: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లిలో మీ సేవ కేంద్రం, పశువైద్యశాల భవనం, బస్సుషెల్టర్, వెజిటేబుల్ మార్కెట్, వృద్ధాశ్రమం, ఎంపీడీవో కార్యాలయ మీటింగ్ హాల్, ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. వాటితో పాటు వెన్నచెర్ల, దేవునితిర్మలాపూర్, దేవినేనిపల్లి, సాతాపూర్, చెన్నపురావుపల్లి, కల్వకోల్, పెద్దకార్పాములలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు కాంగ్రెస్‌కు పళ్లెంలో పెట్టి అధికారాన్ని అప్పగించామని పేపర్‌లో ప్రకటనలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పట్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల్లో పెడితే రూ.7 లక్షల కోట్ల అప్పు చేసి, రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాసులు, ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మ, సర్పంచ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

రాజోలి, జనవరి 29 : మార్కులు తక్కువగా వచ్చాయని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం తుమ్మలపల్లికి చెందిన ఉదయేశ్వర్ రెడ్డి కుమారుడు శ్రవణ్ కుమార్ రెడ్డి (25) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. సంక్రాంతి పండుగ సెలవులకు స్వగ్రామానికి వచ్చాడు. ఆదివారం తిరిగి కళాశాలకు వెళుతున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. హాస్టల్‌కు చేరుకున్నాడా లేదా అని తెలుసుకునేందుకు కుటుంబ సభ్యులు అతడికి ఫోన్ చేయగా ఎంతకీ లిఫ్ట్ చేయలేదు. దీంతో శ్రవణ్ స్నేహితులకు ఫోన్ చేయగా హాస్టల్‌కు రావడానికి ఆలస్యం అవుతుందని చెప్పాడని తెలిపారు. ఇదిలా ఉండగానే శ్రవణ్ కుమార్ మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులకు పోలీసులు ఫోన్ చేసి సమాచారం అందించారు. కాలేజీకి వెళుతున్నానని వెళ్లిన కుమారుడు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. మార్కులు తక్కువ వచ్చాయని తమ కుమారుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి సోమవారం మహబూబ్‌నగర్ రైల్వే పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.


శ్రవణ్ కుమార్ రెడ్డి (ఫైల్)

ఏసీబీ వలలో అయిజ విద్యుత్ లైన్‌మన్

- రూ. 25 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

అయిజ, జనవరి 29 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజకు చెందిన విద్యుత్ లైన్‌మన్ జీవరత్నంను ఏసీబీ అధికారులు సాక్ష్యాధారాలతో పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి సోమవారం సాయంత్రం ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అయిజ పట్టణానికి చెందిన వీరేష్ కర్నూ ల్ రహదారిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు ఉన్న సర్వే నెంబర్ 733లో 133 గజాల స్థలాన్ని ఇంటి నిర్మాణం కోసం కొనుగోలు చేశారని తెలిపారు. ఇందులో దెబ్బతిన్న విద్యుత్ స్తంభం ఉండటంతో దాన్ని తొలగించాలని 2022 జనవరిలో సంబంధిత విద్యుత్ లైన్‌మన్ జీవరత్నంను కలువగా రూ.1,35,000 ఇవ్వాలని డిమాం డ్ చేశారని చెప్పారు. అందుకు వీరేష్ ఒప్పుకొని కొద్ది కొద్దిగా విద్యుత్ అధికారికి ఇస్తూ వచ్చారని తెలిపారు. దీంతో లైన్‌మన్ విద్యుత్ స్తంభాన్ని గత సంవత్సరం ఫిబ్రవరిలో తొలగించారని వివరించారు. ఇంకా ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయటంతో వీరేష్ తమను సంప్రదించినట్లు చెప్పారు. ఈ మేరకు సోమ వారం సాయంత్రం 6:30 గంటలకు ఎన్‌టీఆర్ సర్కిల్ అపోలో మెడికల్ దుకాణం సమీపంలో జీవరత్నంకు వీరేష్ లంచంగా రూ. 25,000 ఇచ్చి తమకు సమాచారం ఇచ్చారన్నారు. వెంటనే ఎస్‌ఐలు లింగస్వామి, జిలానీలతో కలిసి జీవరత్నంపై దాడి చేసి నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ స్పెషల్ కోర్టులో హాజరుపరుస్తున్న ట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సామాన్యుల నుంచి లంచం తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగుల వివరాలు తమ దగ్గర ఉన్నాయని, వారిపై త్వరలో దాడులు చేస్తామని ఆయన చెప్పారు.


ఏసీబీకి పట్టుబడిన అయిజ విద్యుత్ లైన్‌మన్ జీవరత్నం

ఇసుక అక్రమ డంపులు సీజ్

రాజోలి, జనవరి 29 : అక్రమంగా డంప్ చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు, పోలీసులు సీజ్ చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రభుత్వ అనుమతుల పేరుతో నదిలో నుంచి పట్టపగలే ఇసుకను తరలించి, డంపు చేస్తున్న విషయం ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. విషయం తెలుసుకున్న రాజోలి తహసీల్దార్ శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో ఆర్ఐ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది తనిఖీలు నిర్వహించి దాదాపు 23 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు వారు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కేటీదొడ్డి, జనవరి 29 : అనుమతి లేకుండా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. అయిజ నుంచి రాయిచూరుకు బొలెరో వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా సోమవారం తెల్లవారుజామున మల్లాపురం తండా శివారులో పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని పోలీసుస్టేషనుకు తరలించి, డ్రైవర్, ఓనర్ మండ్ల నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

గోపాల్‌పేట, జనవరి 29: వనపర్తి జిల్లా బుద్దారం గ్రామానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లోని వనస్థలిపురం శ్రీనివాస కాలనీలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన పానుగంటి కుర్మయ్య పెద్ద కుమారుడు పానిగంటి సాయికృష్ణ (24) హైదరాబాద్ వనస్థలిపురంలోని శ్రీనివాసకాలనీలో నివసిస్తున్నాడు. అక్కడే పెయింటర్‌గా పనిచేసుకుంటూ వచ్చిన డబ్బులతో తాగుడుకు బానిస అయ్యాడు. తాగుడు విషయంలో తండ్రి పలుమార్లు మందలించినా ఫలితం లేకపోయింది. ఆదివారం అర్ధరాత్రి దాటాక తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి కురుమయ్య ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకుని మృతదేహానికి పంచనామా చేశామని ఎస్ఐ తెలిపారు.


సాయికృష్ణ (ఫైల్)

ట్రాన్స్‌జెండర్ల మధ్య ఘర్షణ

గద్వాల క్రైం, జనవరి 29 : మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాలకు చెందిన ట్రాన్స్‌జెండర్ల మధ్య ఘర్షణ జరిగింది. మహబూబ్‌నగర్‌కు చెందిన కొందరు ట్రాన్స్‌జెండర్లు సోమవారం గద్వాలలోని దుకాణాల్లో డబ్బులు వసూలు చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ట్రాన్స్‌జండర్లు అక్కడికి చేరుకొని వాగ్వాదానికి దిగారు. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడి వచ్చి వసూలు చేయడం సరికాదన్నారు. ఈ క్రమంలో వారి మధ్య ఘర్షణ జరిగింది. పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో పరస్పరం దాడులు చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. గద్వాలకు చెందిన చిట్టి, హైమ ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కందూరు రామలింగేశ్వరాలయం

పాలక మండలి సభ్యుల రాజీనామా

అడ్డాకుల, జనవరి 29 : మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండల పరిధిలోని కందూరు రామలింగేశ్వరాలయం పాలక మండలి సభ్యులు సోమవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను దేవాలయ అకౌంటెంట్ అనంతవర్మకు అందించారు. రాజీనామా చేసిన వారిలో చైర్మన్ రమేశ్‌గౌడ్, ధర్మకర్తల మండలి సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, చంద్రమౌళి, నక్క రమేశ్‌యాదవ్, భువనేశ్వరి, కొత్త లక్ష్మయ్య, రామకృష్ణ ఉన్నారు. కాగా, రాజీనామాలతో పాటు దేవాలయ ఆదాయ వివరాలు, దాతల సహకారంతో చేకూరిన నిధులు, ప్రస్తుత బ్యాంకు నిల్వ వివరాలను పారదర్శకంగా ఉండాలని సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు.

స్వాప్ పాయింట్లు దుర్వినియోగం చేసిన

జీహెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలపై ఆర్జేడీ సీరియస్
- మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం

మహబూబ్‌నగర్ విద్యావిద్యావిభాగం, జనవరి 29 : గత సెప్టెంబర్‌లో జరిగిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన 17 మంది తప్పుడు సమాచారం ఇచ్చి విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా స్పౌజ్ పాయింట్లను ఉపయోగించుకొని అనుకూలమైన పాఠశాలలను ఎంచుకున్నారని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తా కథనాలతో ఆర్‌జేడీ విజయలక్ష్మి డీఈవో నుంచి జీహెచ్‌ఎంలకు సంబంధించిన పూర్తి వివరాలు తెప్పించుకున్న విషయం పాఠకులకు తెలిసిందే. ఈ మేరకు స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం జరిగాయని ధ్రువీకరించిన అధికారులు తొమ్మిదిమంది జీహెచ్‌ఎంలకు ఈనెల 10న ఆర్జేడీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులు అందిన మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. అయితే జిల్లా విద్యాశాఖ కొందరు వాటిని దాచిపెట్టడంతో సోమవారం తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆర్జేడీ విజయలక్ష్మిని కలిసి స్పౌజ్ పాయింట్స్ తప్పుడు సమాచారం ఇచ్చి దుర్వినియోగం చేసిన జీహెచ్‌ఎంలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దీంతో ఈనెల 10న షోకాజ్ నోటీసులు అందించామని, డీఈవోల నుంచి ఇప్పటివరకు తమకు ఎలాంటి రిప్లై రాలేదని చెప్పారని ఆయన తెలిపారు.

దీనిపై ఆర్జేడీని 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ద్వారా వివరణ కోరగా 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం ఆధారంగా తొమ్మిదిమంది జీహెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు పంపినట్లు తెలిపారు. స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం జరిగినట్లు తేలిందన్నారు. పూర్తి వివరాలు అందిన వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డీఈవో రవీందర్ ఇచ్చిన సమాచారం మేరకు నవాబ్‌పేట మండలం పెద్దఆదిరాల జడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం పి.యుగేందర్, ఇదే మండలం కారుకొండ జడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం వెంకటేశ్వరమ్మ, ఇప్పటూర్ జడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం పి.కృష్ణయ్య, గండీడ్ మండలం సల్కర్‌పేట జీహెచ్‌ఎం కృష్ణవేణి పవార్, మహమ్మదాబాద్ జడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం బి.వెంకట్‌రెడ్డి, అడ్డాకుల మండలం కోడూరు జడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం రాణిమాలినిదేవి, మూసాపేట మండలం నిజలాపూర్ జడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం యు.వనజ, జడ్చర్ల మండలం పోలేపల్లి జడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం కే.నాగేంద్రమ్మ, హన్వాడ మండలం చిన్నదర్పల్లి జడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం నాగ్యానాయక్‌లకు షోకాజ్ నోటీసులు అందించినట్లు వివరించారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 29 : దేశంలో వివిధ రాష్ట్రాల్లో రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను అస్థిరపరుస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఓడిద్దామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ మాట వినని రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు విడుదల చేయకపోవడం, గవర్నర్ ద్వారా ప్రభుత్వాలను అస్థిర పరచడం వంటి కుటిల రాజకీయాలకు బీజేపీ పాల్పడుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు శక్తులకు అప్పజెప్తూ బీజేపీ అధికార, రాజకీయ పబ్బం గడుపుతోందని విమర్శించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్, కె.గీత, ఆంజనేయులు, కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసులు, బాల్‌రెడ్డి, మల్లేష్, ఈశ్వర్, అశోక్, శివవర్మ, నరసింహ, బాలస్వామి పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్ తయారు చేయాలి : ఎంపీపీ

మిడ్జిల్, జనవరి 29: సబ్‌కి యోజన సబ్‌కా వికాస్ యాక్షన్ ప్లాన్‌ను తయారు చేయాలని ఎంపీపీ బరిగెల సుదర్శన్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన సబ్‌కి యోజన సబ్‌కా వికాస్ కార్యక్రమంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని తొమ్మిది శాఖల నుంచి పనుల ప్రతిపాదనలను తయారు చేసి, ప్రాధాన్యత ప్రకారంగా నిధులు మంజూరు అవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిలక్ష్మీ, ఎంపీవో అనురాధ, ఏవో సిద్ధార్థ, ఎంఈవో మంజులాదేవి, వెటర్నరీ డాక్టర్ శ్రావణి తదితరులున్నారు.

పోక్సో కేసులో నేరస్తుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

- రూ.15 వేలు జరిమానా

నారాయణపేట, జనవరి 29 : పోక్సో కేసులో నేరస్థుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.15 వేలు జరిమానా విధిస్తూ నారాయణపేట జిల్లా సెషన్స్ న్యాయాధికారి ఎండీ రఫీ సోమవారం తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట జిల్లా మాగనూర్ పీఎస్ పరిధిలోని నేరడుగం గ్రామానికి చెందిన కర్రెమొల్ల బాలరాజు తొమ్మిదవ తరగతి చదువుతున్న బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలి తల్లి 2022, నవంబరు 23న ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ నరేందర్ ఎఫ్‌ఐఆర్ నమోదు చేయగా, మక్తల్ సీఐ సీతయ్య కేసును విచారణ చేపట్టి నేరస్థుడిపై పీడీజే కోర్టులో చార్జిషీట్ వేశారు. కోర్టు లైజన్ ఆఫీసర్ బాలకృష్ణ కోర్టు డ్యూటీ ఆఫీసర్ల సహాయంతో 15 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి వాదనలు వినిపించగా, జిల్లా సెషన్స్ న్యాయాధికారి ఎండీ రఫీ సోమవారం నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార జైలుశిక్ష, రూ.15 వేల జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.ఐదు లక్షల పరిహారం ప్రభుత్వం చెల్లించాలని తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ యోగేష్ గౌతమ్ కేసు విచారణ చేపట్టిన మక్తల్ సీఐ సీతయ్య, ఎస్‌ఐ నరేందర్, సీఐ రామ్‌లాల్, ఎస్‌ఐ మల్లేష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళీకృష్ణ, ఆకుల బాలప్ప, లైజనింగ్ ఆఫీసర్ బాలకృష్ణ, కానిస్టేబుల్ విజయ్, రవీందర్‌ను అభినందించి, త్వరలోనే రివార్డులను అందించనున్నట్లు తెలిపారు.

చిన్నారి అదృశ్యం, కేసు నమోదు

జడ్చర్ల, జనవరి 29 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కాలనీలో నాలుగు సంవత్సరాల చిన్నారి సోమవారం అదృశ్యమైంది. నర్వ మండలం ఉండేకోడ్ గ్రామానికి చెందిన రాజు తన కుమారుడు బాబు, కుమార్తె రేణుతో కలిసి రాజీవ్‌నగర్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. పిల్లలను ఇంటి వద్దనే ఉంచి, మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చిన సందర్భంలో కూతురు రేణు కనిపించలేదు. దీంతో పరిసర ప్రాంతంలోనే ఆడుకుంటుండవచ్చని భావించి, మళ్లీ పనిలోకి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన అనంతరం చూసుకోగా కుమారుడు మాత్రమే ఉండి, కుమార్తె ఇంటికి రాకపోవడంతో వెంటనే 100 డయల్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి జడ్చర్ల పోలీసులు చేరుకుని పాప ఆచూకీ కోసం వెతుకుతున్నారు. రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గండీడ్ మండలంలో ఇద్దరు..

గండీడ్, జనవరి 29 : మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలోని ఓ గ్రామంలో ఇద్దరు అదృశ్యమయ్యారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గ్రామంలో ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. మూడేళ్ల క్రితం ఆమెను వదిలేసి మరో యువతిని వివాహం చేసుకొని దూరంగా ఉంటున్నాడు. ఇటీవల ఆ వ్యక్తి స్వగ్రామానికి వచ్చి ఉంటున్నాడు. అయితే, మొదట ప్రేమ వివాహం చేసుకున్న తమ కూతురు, మనుమడు ఈనెల 25 నుంచి కన్పించడం లేదని గ్రామానికి ఆ వ్యక్తి అత్త ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మిడ్జిల్, జనవరి 29 : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని ఖైరంపల్లి గ్రామ శివారులోని దుందుబివాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగేశ్వరనాయుడు సోమవారం తెలిపారు. ఖైరంపల్లి గ్రామ శివారులోని వాగు నుంచి పదుల సంఖ్యలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం రావడంతో వెంటనే తమ సిబ్బందిని వాగువద్దకు పంపించగా అక్కడినుంచి కొందరు తప్పించుకున్నారన్నారు. జడ్చర్ల మండలం గంగాపూరం గ్రామానికి చెందిన ఒక ట్రాక్టర్, మిడ్జిల్ మండలం ఖైరంపల్లి గ్రామానికి చెందిన మరో ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

సమన్వయ లోపం వల్లే అధికారం కోల్పోయాం

- కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అమలు చేయకుంటే ప్రజల పక్షాన పోరాడతాం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గద్వాల న్యూటౌన్, జనవరి 29 : ప్రజలు, నాయకుల మధ్య సమన్వయలోపం వల్లే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అధికారం నుంచి కూలిపోయిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వర్తి లేకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందడం వల్ల ప్రజలతో సమన్వయం కొరవడి కొంత ఇబ్బంది కలిగిందని, ఇలాంటివి భవిష్యత్తులో జరుగకుండా జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. 60 ఏళ్లలో సాధ్యంకాని అభివృద్ధి గత ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో పదేళ్లలోనే సాధ్యమైందన్నారు. కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ప్రజలకు, నాయకులకు మధ్య సమన్వయం లోపించడం వల్లే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందన్నారు. ఇలాంటివి భవిష్యత్తులో జరుగకుండా దృష్టి పెడతామన్నారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించి, మన ప్రాంత అభివృద్ధికి కృషి చేసే విధంగా ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తామని భావించామని, కానీ అనుకున్నన్ని స్థానాలు రాలేదని చెప్పారు. కొన్ని చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులు స్వల్ప మెజారిటీతో ఓడిపోయారని తెలిపారు. గద్వాలలో తన గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు గౌరవం దక్కలేదన్నారు. అయినా గద్వాలలో మా నాయకుడి గెలుపుకోసం అహర్నిషలు కృషి చేస్తునే ఉంటామన్నారు. గట్టు ఎంపీపీ విజయ్ మాట్లాడుతూ మంత్రిగా ఉన్న సమయంలో శ్రీనివాస్‌గౌడు తమ సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. అనంతరం సర్పంచుల పదవీ కాలం పూర్తవుతున్న సందర్భంగా వారిని మంత్రి, ఎమ్మెల్యే సన్మానించారు.

జీవితంలో డిజిటల్ మార్కెటింగ్ అంతర్భాగం

- పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గిరిజా మంగతాయారు
- పీయూలో రెండు రోజుల నేషనల్ సెమినార్



పీయూలో సావనీర్‌ను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గిరిజా మంగతాయారు

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 29 : మారుతున్న కాలానుగుణంగా మనిషి జీవితంలో డిజిటల్ మార్కెటింగ్ ఒక అంతర్భాగమని పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గిరిజా మంగతాయారు అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ మార్కెటింగ్ అంశంపై నిర్వహించిన రెండు రోజుల నేషనల్ సెమినార్‌కు ఆమె హాజరై, ప్రసంగించారు. పెరుగుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో డిజిటల్ మార్కెటింగ్ మానవ జీవితంతో ముడిపడి ఉందని, మారుమూల ప్రాంతాల్లో తయారు చేసిన ఉత్పత్తులకు ప్రపంచ స్థాయిలో మార్కెటింగ్ చేయవచ్చన్నారు. అనంతరం కీనోట్ స్పీకర్‌గా హాజరైన సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ మాట్లాడుతూ నేటి యుగంలో ప్రతీ వస్తువు ఆన్‌లైన్‌లోకి వెళ్లిందని, ఇంటర్నెట్ మానవ జీవితాలను మెరుగుపర్చిందన్నారు. ప్రస్తుత మార్కెట్ గణాంకాలు పరిశీలిస్తే 80 శాతం దుకాణాల్లో క్రయవిక్రయాలు ఆన్‌లైన్‌లో జరుగుతున్నట్లు తెలిపారు. వ్యాపార రంగంలో డిజిటల్ మార్కెటింగ్ ముఖ్యమైందన్నారు.

కార్యక్రమంలో సెమినార్ చైర్మన్ డాక్టర్ చంద్రకిరణ్, కోచైర్మన్ డాక్టర్ కృష్ణయ్య, పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ రాజ్‌కుమార్, కన్వీనర్ డాక్టర్ అర్జున్‌కుమార్, కోకన్వీనర్ నాగసుధ, కోఆర్డినేటర్ ఎం.జావేద్, అధ్యాపకులు, అరుంధతిరెడ్డి, రవికుమార్, రంగప్ప, జిమ్మి కాటన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

అలంపూర్ చౌరస్తా, జనవరి 29 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని బొంకూరు శివారులోని రాయచూరు రహదారిపై కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ భానోత్‌పటేల్ తెలిపారు. అంతరాష్ట్ర రహదారిపై సోమవారం ఉదయం ఆయన తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో రాయచూరు వైపు ఉంచి ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా, 55 కాటన్ల మద్యం లభించింది. దీంతో కారును స్వాధీనం చేసుకొని, ఎక్సైజ్ కార్యలయానికి తరలించి, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.2.5 లక్షలు ఉంటుందని తెలిపారు. మద్యాన్ని కర్ణాటక రాష్ట్రంలో కొనుగోలు చేసి ఏపీలో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు తెలిపారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ గోవిందు ఉన్నారు.

అవినీతిపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టరేట్ ముందు సీఐటీయూ ధర్నా


కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్(కలెక్టరేట్), జనవరి 29 : లేబర్ కార్యాలయంలో జరుగుతున్న అవి నీతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మూసాపేట మండల హమాలీలు, సీఐటీయూ నాయకులు సోమవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. మూసాపేట మండలం లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీల యూనియన్ కార్మిక సంఘం రిజిస్ట్రేషన్ కోసం సంవత్సరం క్రితం దరఖాస్తు చేసుకుంటే ఇప్పటివరకు ఆ శాఖ అధికారులు స్పందించడం లేదని సంఘం నాయకులు ఆరోపించారు. ఈ శాఖలో జరుగుతున్న అవినీతిపై తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకున్న సంఘాలు తక్షణమే రిజిస్ట్రేషన్ చేయాలని, అవినీతికి పాల్పడిన ఉద్యోగులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి అన్ని కార్మిక సంఘాల నాయకులు మద్దతు తెలుపుతూ మాట్లాడారు. అనంతరం కలెక్టర్‌కు వినతిని సమర్పించారు. కార్యక్రమంలో హమాలీ కార్మికులు నాగయ్య, మైబు, నారాయణ, సీఐటీయూ నాయకుడు నలవెల్లి కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సమ్మె నోటీస్ ఇచ్చిన కార్మిక సంఘాలు

కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ, హెచ్‌ఎంఎస్ తదితర కార్మిక సంఘాల నాయకులు కలెక్టర్ జి.రవినాయక్‌కు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నలవెల్లి కురుమూర్తి, జిల్లా నాయకుడు కిల్లె గోపాల్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎం.రాంమోహన్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు గణేష్, టీఎన్‌టీయూసీ జిల్లా నాయకుడు ధన్వాడ రాములు తదితరులు కలెక్టర్‌ను కలిసి సమ్మె నోటీసును అందించారు.

ఆపద మొక్కులవాడు అభయాంజనేయుడు

- వచ్చే నెల 3నుంచి ఊర్కొండపేట అభయుడి బ్రహ్మోత్సవాలు
- 5న రాత్రి రథోత్సవం
- తరలిరానున్న భక్తులు


ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయం

ఊర్కొండ, జనవరి 29: నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేటలో వెలసిన ఆంజనేయస్వామి వారి ఆలయం అతి పురాతనమైనది. ఇక్కడ నిత్యం తైలాభిషేకం, పంచామృతాభిషేకం, అర్చనలు కొనసాగుతున్నాయి. ఆపదలో ఉన్న భక్తులకు నేనున్నానంటూ అభయము ఇచ్చే స్వామి ఊర్కొండపేట అభయాంజనేయుడు. ప్రతీ శని, మంగళవారాల్లో భక్తులతో ఆలయం కిటకిటలాడుతుంది. జైహనుమాన్, జైశ్రీరామ్ నామస్మరణతో మారుమోగుతుంది. కాగా, ఫిబ్రవరి 3వ తేదీ నుంచి అభయాంజ నేయ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభ మవుతాయని ఆలయ అధికారులు, అర్చకులు తెలిపారు. శనివారం ఉదయం చిరి వేళ్లి కృష్ణమూర్తిశర్మ అర్చకుల గృహం నుంచి ఉత్సవ మూర్తిని పల్లకిలో ఊరేగిస్తారు. 5న రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బీఆర్ అంబేడ్కర్

- ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ

పెద్దకొత్తపల్లి, జనవరి 29 : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ అని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని చంద్రకల్ గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలనరసింహ, ఎంపీటీసీ సభ్యురాలు ఇందిరమ్మ, అంబేడ్కర్ యువజనసంఘం అధ్యక్షుడు బండి నరసింహ, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ అంబేడ్కర్ యువజన సంఘం, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల పెంపకంతో అధిక లాభాలు

- నాబార్డ్ జిల్లా అభివృద్ధి శాఖ మేనేజర్ అఖిల్



తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు

బిజినేపల్లి, జనవరి 29 : రైతులు ఆయిల్‌పామ్ తోటల పెంపకం చేపట్టడం ద్వారా అధిక లాభాలను అర్జించవచ్చని నాబార్డ్ జిల్లా అభివృద్ధి శాఖ మేనేజర్ అఖిల్ అన్నారు. మండలంలోని కారుకొండ, లింగసానిపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన ఆయిల్ పామ్ తోటలను, నర్సరీని సోమవారం పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేష్, నాగర్‌కర్నూల్ డివిజన్ ఉద్యానశాఖ అధికారి మహేశ్వరి ఉన్నారు.

క్రీడల వల్ల మానసిక దృఢత్వం కలుగుతుంది



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 29 : క్రీడల వల్ల మానసిక దృఢత్వం కలుగుతుందని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో జిల్లా పోలీసుల క్రీడాపోటీలు సోమవారం నిర్వహించారు. ఎస్పీ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. జిల్లా పోలీసులు ఆరు టీమ్‌లుగా ఏర్పడి కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్, టెన్నిస్ వంటి క్రీడలు ఆడారు. పోటీలు మూడు రోజుల పాటు నిర్వహించి బుధవారం ముగుస్తాయని ఆయన పేర్కొన్నారు.

అగ్నిమాపక సిబ్బందికి బోట్ ట్రైనింగ్

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 29 : అగ్నిమాపక శాఖ నాగర్‌కర్నూల్ ఫైర్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్‌వో ఐ.కృష్ణమూర్తి సోమవారం కేసరి సముద్రంలో ఫైర్ సిబ్బందికి బోట్ ట్రైనింగ్ ఇచ్చారు. ఎవరైనా వ్యక్తులు నీళ్లల్లో మునిగినప్పుడు, వరదల్లో చిక్కుకున్నప్పుడు బోటు సహాయంతో ఎలా రక్షించాలని అనే అంశాలపై ట్రైనింగ్ ఇచ్చినట్లు ఎస్ఎఫ్‌వో తెలిపారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి నిధులు

దోమలపెంట, జనవరి 29: నల్లమల అటవీ ప్రాంతాల్లో ఉన్న పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి వట్టువర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పీహెచ్‌సీలో అన్ని వసతులు, 24 గంటల వైద్యం అందించేందుకు డాక్టర్, సిబ్బంది, ఉండేందుకు రూ 52.50లక్షలతో క్యాటర్స్ నిర్మాణం, ప్రహరి, ఆస్పత్రిలో మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరు చేసినట్లు సర్పంచ్ చంద్రనాయక్ సోమవారం తెలిపారు. త్వరలో పనులకు ప్రభుత్వం తరుపున టెండర్లు పిలుస్తారని ఆయన తెలిపారు.

శాస్త్రీయ, వైజ్ఞానిక దృక్పథంతోనే సమాజ అభివృద్ధి

- జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 29: శాస్త్రీయ, వైజ్ఞానిక దృక్పథంతోనే సమాజం సమగ్ర అభివృద్ధి చెందుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకి పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోటేశ్వర్, తిరుపతయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మానవుల మనుగడకు సైన్స్ ఎంతో ఉపయోగపడుతుందని పెద్దకొత్తపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి అన్నారు. సోమవారం ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నందీశ్వర్, రాఘవేందర్, సాయిశంకర్, వెంకటస్వామిగౌడ్, నిరంజన్, రాధాకృష్ణ, శివుడు, గౌస్‌పాషా, శైలజ, బేగం, రాజేశ్వరి, కృష్ణయ్య పాల్గొన్నారు.

తిమ్మాజిపేట: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం తిమ్మాజిపేట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం సత్యనారాయణశెట్టి, టాలెంట్ టెస్టు ఇన్‌చార్జి కిరణ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తెలకపల్లి, జనవరి 29 : మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి రానున్నారని, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కొల్లాపూర్, జనవరి 29 : కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం గ్రామంలో ఆరోగ్యంతో బాధపడుతూ మరణించిన జయరాములు కుటుంబ సభ్యులను, అదే గ్రామానికి చెందిన మృతురాలు బాలమ్మ కుటుంబ సభ్యులను సోమవారం కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన మద్దిలేటి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్లూరు గ్రామానికి చెందిన సులేమాన్ కుటుంబానికి మంజూరు అయిన పార్టీ బీమా చెక్కును మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'సర్పంచుల పదవీ కాలాన్ని పొడిగించాలి'

కోడేరు, జనవరి 29 : సర్పంచుల పదవీకాలన్ని ఆరునెలలు పెంచాలని మండల సమావేశంలో సర్పంచులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ సమావేశం మండల అధ్యక్షురాలు కొండ రాధా సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. నాగులపల్లి సర్పంచ్ వెంకటస్వామి మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసి వాటికి డబ్బులు రాలేదని ఆవేదన వ్యక్తం చేయగా మండల పంచాయతీ అధికారి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ స్పెషల్ ఆఫీసర్లు ఏర్పాటు అయ్యాక కూడా చేసిన బిల్లులు తీసుకోవచ్చన్నారు. సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ కొత్త శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో బాలచందర్ సుజన్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల పరిశీలన

వంగూరు, జనవరి 29 మండలంలోని ఉల్పర, పోతారెడ్డిపల్లిలో సోమవారం ఇసుక రీచ్‌లను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సురేందర్‌రెడ్డి పరిశీలించి వేబిల్లులను చెక్ చేశారు. ప్రభుత్వ అనుమతుల ప్రకారం వాగుల నుంచి ఇసుకను తీయాలని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. వాగుల్లో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

కేసరి సముద్రంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 29 : కేసరి సముద్రంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం(30) లభ్యమైనట్లు ఎస్ఐ మహేందర్ సోమవారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని వెలికితీశారు. ఎలాంటి ఆధారాలు లభించలేదు. మూడు రోజుల క్రితం కేసరి సముద్రంలో పడి ఉండవచ్చని ఎస్ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

ల్యాబ్ టెక్నీషియన్ల క్యాలెండర్ ఆవిష్కరణ

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి29: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల నూతన క్యాలెండర్ 2024ను జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్, జిల్లా మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.కళ్యాణ్ కృష్ణారావు, సలహాదారు లక్ష్మీనరసింహాగౌడ్, కొండలయ్య, శ్రీధర్‌రెడ్డి, నారాయణ, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తుల పరిశీలనను
వేగవంతంగా పూర్తి చేయాలి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తహసీల్దార్లను ఆదేశించారు. ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణల కోసం ఫామ్6, 7, 8ల ద్వారా అందిన దరఖాస్తుల నిర్వహణ, ధరణి పెండింగ్ దరఖాస్తులపై అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, కే.సీతారామారావులతో కలిసి తహసీల్దార్లు, ఆర్డీవోలతో కలెక్టరేట్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఫిబ్రవరి 8న తుది ఓటర్ల జాబితా విడుదల కానుందని తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను విడుదల చేసేందుకు తహసీల్దార్లు దరఖాస్తు ఫారంలను క్షుణ్ణంగా పరిశీలించి జాబితాలో చేరేలా చూడాలన్నారు. నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణల కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించడంతోపాటు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఆర్డీవోలు, తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఫారం 6 ద్వారా వచ్చిన 5796దరఖాస్తులు, ఫారం 7 ద్వారా వచ్చిన 3687 దరఖాస్తులు, ఫారం 8ద్వారా వచ్చిన 2987దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని వాటన్నింటినీ రానున్న రెండు రోజుల్లో పరిశీలించి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో రానున్న రోజుల్లో రాష్ట్రస్థాయి ఓటర్ల సవరణ పరిశీలన అధికారి రోల్ అబ్జర్వర్ పర్యటించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ధరణి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్ లాగిన్‌లో ఉండే ధరణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. బినామీ పేర్లతో కొనసాగే రేషన్ షాపుల వివరాలను, నూతన రేషన్‌షాపులకు నమోదు చేసుకున్న దరఖాస్తులను వెంటనే అందించాలని ఆదేశించారు. మీ సేవా ద్వారా వచ్చిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, కే.సీతారామారావు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 26దరఖాస్తులు ప్రజావాణిలో నమోదయ్యాయి. ప్రజావాణి కార్యక్రమానికి గైర్హాజరైన వైద్యారోగ్య శాఖకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజలు సమర్పించే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ సోమవారం సైతం ఎప్పటిలాగే ధరణికి సంబంధించిన సమస్యల దరఖాస్తులు వచ్చాయి. నల్లమల అటవీ ప్రాంతాల్లోని చెంచుల ఆవాసాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయా చెంచుగూడెలకు చెందిన చెంచులు కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌కు వినతి పత్రాలు అందజేశారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్‌లు ప్రజావాణిలో భాగంగా దరఖాస్తులను స్వీకరించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా ఇంటర్ విద్యా నోడల్ అధికారి జి.వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ విద్యా నోడల్ అధికారి వెంకటరమణ

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 29: వచ్చేనెల 1 నుంచి 15 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్యా నోడల్ అధికారి జి.వెంకటరమణ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యా నోడల్ అధికారి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 41పరీక్ష కేంద్రాలలో నిర్వహిస్తున్న ప్రాక్టికల్స్ పరీక్షకు మొత్తం 5745 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ఫస్ట్ స్పెల్ ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు, సెకండ్ స్పెల్ 6నుంచి 9 వరకు, థర్డ్ స్పెల్ పరీక్షలు 10 నుంచి 15 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు తాగునీరు, టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతి ప్రాక్టికల్ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఏ రోజు ప్రయోగ పరీక్ష మార్కులను అదేరోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రయోగ పరీక్షలు ప్రతీ రోజు ఉదయం 9నుంచి 12 వరకు, అలాగే మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగనున్నాయని తెలిపారు. ప్రయోగ పరీక్ష ప్రశ్నాపత్రం ఓపెన్ చేయడానికి అరగంట ముందు ఎక్జామినర్ ఫోన్‌ను ఓటీపీ వస్తుందన్నారు. పరీక్ష పూర్తి కాగానే అన్ని సబ్జెక్టుల సంబంధించి జవాబు పత్రాలను సీల్ చేసిన కవర్‌లో కన్వీనర్‌కు పంపించాలని ఆయన సూచించారు.

బ్లడ్ బ్యాంక్ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 29: బ్లడ్ బ్యాంక్ భవన నిర్మాణ పనులకు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బ్లడ్ బ్యాంక్ భవనం నిర్మాణ పనులను ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. నిర్మాణ పనులకు సంబంధించి డీపీఆర్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే నిర్మాణ పనుల్లో రాజీ లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రెడ్‌క్రాస్ సేవలు మరింత విస్తరించి ఈ ప్రాంతంలో రక్తనిధికి కొరత లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీధర్, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ డి.కుమార్, బ్లడ్ డినేషన్ కన్వీనర్ రాజ్‌కుమార్, కౌన్సిలర్ జక్కా రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ దామోదర్‌రెడ్డి మృతిపై ఎమ్మెల్యే సంతాపం

తెలకపల్లి : మండల పరిధిలోని పెద్దూరు సర్పంచ్ కసిరెడ్డి దామోదర్‌రెడ్డి మృతి చెందారు. సోమవారం ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి పెద్దూరుకు వెళ్లి ఆయన భౌతికకాయానికి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట సింగిల్ విండో మాజీ చైర్మన్ రంగారెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య తదితరులున్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే


వెల్దండ, జనవరి 29 : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాలలో సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ విజయ అధ్యక్షతన మండల సభ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ కలిసి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు గుర్తించాలని సూచించారు. గ్రామాలలో ఇళ్లపై నుంచి విద్యుత్ వైర్లు వెళ్లి ప్రమాదభరితంగా మారాయని తక్షణమే వాటిని మార్చాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. మండలంలోని బర్కత్‌పల్లి వద్ద ఆగిపోయిన కేఎల్ఐ పనులను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేఎల్ఐ కాలువలో భూములు కోల్పోయిన రైతులు ఎంతమందికి పరిహారం అందాల్సిఉందో నివేదిక అందజేయాలని సూచించారు. అధికారులు విధిగా మండల సభకు హాజరుకావాలని, అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే అన్నారు. అంతకుముందు ఈనెల చివరన వదవీకాలం ముగియనున్న సర్పంచులను సన్మానించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు విజితారెడ్డి, వైస్ ఎంపీపీ శాంతి, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ రవి కుమార్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రైతువేదిక, పీహెచ్‌సీ ప్రారంభించిన ఎమ్మెల్యే : మండల పరిధిలోని చెర్కూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతువేదిక, పీహెచ్‌సీలను జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌తో కలిసి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమానికి పెద్దపీట

కల్వకుర్తి : అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని సిలార్ పల్లితోపాటు పట్టణంలోని పలు వార్డుల్లో రూ.75లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. మునిసిపల్ కార్యాలయంలో ఐదు చెత్త సేకరణ ఆటోలను ప్రారంభించారు. మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే మండలంలోని 47మందికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీ సింగ్, మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహేద్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మాజీ జడ్పీటీసీ అశోక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేద్దాం



మండల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

బల్మూరు, జనవరి 29 : ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం ఉపాధి హామీ సమావేశం హాలులో ఎంపీపీ వేనేపల్లి అరుణ నరసింహారావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి సర్పంచులకు వెంటనే బిల్లులు చెల్లించాలన్నారు. అధికారులు ప్రజల అవసరాలను గుర్తించి కొత్త పనుల కోసం ప్రపోజల్ తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా ఇరిగేషన్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అభివృద్ధి జరగాలంటే ప్రతి గ్రామంలో పార్టీక తీతంగా ముందుకొచ్చి పట్టుదలతో పని చేయించుకోవాలని ఆయన కోరారు. సమావేశానికి వచ్చిన సర్పంచులను సన్మానించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నూనె నారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మమ్మ, సింగిల్ విండో చైర్మన్ నర్సయ్యయాదవ్, తహసీల్దార్ సలీమోద్దీన్, ఎంపీడీవో దేవన్న, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు వద్దు.. కాల్వలు కావాలి

మండల పరిధిలో ఏర్పాటు చేసే శ్రీ ఉమామహేశ్వర ప్రాజెక్టును నిలుపుదల చేసి కేవలం కాల్వల ద్వారానే సాగునీరందిస్తే బాగుంటుందని అనంతవరం, బల్మూరు, మైలారం గ్రామాల రైతులు కోరారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను ఆయా గ్రామాల రైతులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాధిత రైతులతో మాట్లాడుతూ ఆందోళన చెందొద్దని, ప్రతీ ఒక్కరికి న్యాయం చేస్తామని రైతులకు సూచనప్రాయంగా తెలిపారు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ - కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి29: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజురీఎంబర్స్‌మెంట్స్ వెంటనే విడుదల చేసి విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది కాలంగా వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలకు సంబంధించి మెస్ బిల్లులు సుమారు రూ.6300 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు అడిగినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. వసతిగృహ మెస్ బిల్లులు సకాలంలో రాక వార్డెన్లు అప్పులు చేసి హాస్టల్స్ నడిపించే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గత ఆరు నెలలుగా ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు రూ.7200 కోట్లు స్కాలర్‌షిప్స్, ఫీజురీఎంబర్స్‌మెంట్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 14 లక్షల మంది విద్యార్థులు ఫీజు కార తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ స్కాలర్‌షిప్స్, బిల్లులు చెలించి ప్రభుత్వ విద్యను మెరుగుపరుచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కార్తీక్, నాయకులు రామకృష్ణ, రవి, శివ, వినయ్, చందు, అబి తదితరులు పాల్గొన్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 29: నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం పట్టణంలోని టెలిఫోన్ ఆఫీస్ పక్కన ఉన్న ఎస్‌జేఆర్ ఫంక్షన్‌హాల్ నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో ఉష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా మంత్రితో పాటు ప్రజా ప్రతినిధులు, జడ్పీటీసీ సభ్యులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరుకావాలని ఆమె కోరారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ పండుగ

అచ్చంపేట జనవరి 29: యాదవులు భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ పండుగను జరుపుకున్నారు. అచ్చంపేట మండలం సింగారం గ్రామంలో బైయిండ్ల పూజారులు అమ్మవారి ఆలయం ముందు కుంకుమ, పసుపు, పిండితో ప్రత్యేక పటాలను వేసి పూజలు చేశారు. పెద్దమ్మ తల్లిని దర్శించుకొనేందుకు యాదవులు వారి బంధుమిత్రులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. పురుషులపై బండారు చల్లారు. అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు.

భౌరాపూర్ భ్రమరాంబిక జాతరను ప్రభుత్వమే నిర్వహించాలి

- చెంచు సంఘం నాయకుడు చిర్రరాములు

దోమలపెంట, జనవరి 29: నల్లమలంలో కొలువైన భౌరాపూర్ భ్రమరాంబిక ఉత్సవాలను ప్రభుత్వం అధికారిగా నిర్వహించాలని చెంచు సంఘం నాయకుడు చిర్రరాములు కోరారు. సోమవారం వట్టువర్లపల్లి మాజీ సర్పంచ్ సర్ర్యనాయక్, నాయకులు జహీంగీర్, గోపాల్ ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అటవీశాఖ అధికారులతో మాట్లాడి ఉత్సవాలను వారం రోజులు పాటు చెంచులు నిర్వహించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

రేపు మండల సమావేశం

ఉప్పునుంతల, జనవరి 29: ఉప్పునుంతలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అరుణ నర్సింహరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో సర్పంచులకు సన్మానం కార్యక్రమంలో ఉంటుదని ఆయన తెలిపారు.

టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక


వంగూరు, జనవరి 29: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో సోమవారం టీఎస్ యూటీఎఫ్ మండల మహాసభ నిర్వహించారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎం. నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా జంగయ్య, కోశాధికారిగా మల్లేష్, మహిళా కార్యదర్శిగా వై. దీపలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర బాధ్యుడు ఎ. చిన్నయ్య, లింగమయ్య, వెంకన్న, శ్యామలయ్య, దుర్గప్రసాద్, తిరుమలేష్, సాయిరమేష్, భాస్కర్‌రావు, ఫిరోజ్, దినేష్, బాలగోపాల్ పాల్గొన్నారు.

ఆశించిన స్థాయిలో వేరుశనగ దిగుబడి

లింగాల, జనవరి 29: మండలంలోని ఆయా గ్రామాలలో యాసంగిలో రైతులు సాగు చేసిన వేరు శనగ పంట దిగుబడి ఆశించినస్థాయిలో వచ్చిందని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం లింగాల శివారులోని పొలాల్లో వేరుశనగ కుప్పలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాఖ సూచనలు, సలహాలు పాటించి సాగు చేయడం వల్లనే దిగుబడులు పెరిగినట్లు తెలిపారు. ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడులు వస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో సురేంద్రరెడ్డి, రైతు ఎల్లేష్ పాల్గొన్నారు.

అదృష్టంగా భావిస్తున్నా

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మందకృష్ణ మాదిగ, నాయకులు

ఊర్కొండ, జనవరి 29: మహనీయుల విగ్రహాలు ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం గుడిగానిపల్లిలో మహనీయులు గౌతమ బుద్ధుడు, జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్. అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నాయకుడు బండారి శాంతకుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రజిత, ఎమ్మార్పీఎస్ నాయకులు జంగయ్య మాదిగ, వీరాస్వామి మాదిగ, కృష్ణయ్య మాదిగ, వెంకటేష్ మాదిగ, నాయకులు అయూబ్‌పాషా, నిరంజన్ గౌడ్ తదితరులున్నారు.

సర్పంచులకు సన్మానం

పెంట్లవెల్లి, జనవరి 29 : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వివిధ గ్రామాల సర్పంచులను జడ్పీటీసీ సభ్యురాలు చిట్టెమ్మ, ఎంపీడీవో రామయ్య సన్మానించారు. ఈ సందర్భంగా పెంట్లవెల్లి సర్పంచ్ సువర్ణమ్మ మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధి కోసం సహకరించిన అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సర్పంచులు, ఎంపీవో భరత్‌కుమార్ పాల్గొన్నారు.